

జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దావ వసంత, పాల్గొన్న కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- ప్రోటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- జడ్పీ సమావేశంలో చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్

జగిత్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల అమలు సందర్భంగా అధికారులు ప్రజాప్రతి నిధుల సమన్వయంతో పనిచేయాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పద్మనాయక మినీ కల్యాణ మండపంలో జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇటీవల ప్రజాప్రతినిధుల వ్యవహారంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు. ప్రధానంగా కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రోటోకాల్ సమస్యల పదే పదే తెరపైకి వస్తుందన్నారు. ప్రోటోకాల్‌ను విస్మరిస్తున్న అధికారులపై చర్యలుంటాయన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను, సంక్షేమాన్ని విస్మరిస్తోందన్నారు.

గత ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తూనే కొత్త పథకాలు అమలు చేయాలని కోరుతున్నామన్నారు. రైతుబంధు, రైతు బీమా తదితర పథకాల అమలులో గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడాలు కనిపిస్తున్నాయన్నారు. సీఎంగా కేసీఆర్ వ్యవహరించిన సమయంలో వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలు వర్ధిల్లాయని, ప్రస్తుతం సాగునీటి కోసం రైతులు ఇక్కట్ల పాలవుతున్నారన్నారు. జిల్లాలో విద్యాశాఖ పనితీరు అధ్వానంగా తయారైందన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నప్పటికీ కొన్ని పాఠశాలల్లో కనీసం 20 శాతం సిలబస్ పూర్తికాకపోవడం బాధాకరమన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన రూ. 500లకే సిలెండర్, ఉచిత విద్యుత్ పథకాలు స్వాగతిస్తున్నామని, కానీ అర్హులైన అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయం లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే లోపు అమలులోకి తేవాలన్నారు. జడ్పీ సమావేశాలకు పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు డుమ్మా కొడుతున్నారని, సంబంధిత అధికారుల జాబితాను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా వైద్య శాఖకు చెందిన సూపరింటెండెంట్, నీటి పారుదల శాఖకు చెందిన సీఈ తదితరులు జడ్పీ సమావేశాన్ని నిర్లక్ష్యం చేస్తూ గైర్హాజరవుతున్నట్లు గుర్తించామన్నారు. ఇకనైనా అధికారులు తమ వైఖరిని మార్పు చేసుకోవాలన్నారు.

విద్యాశాఖ అధికారులపై కోరుట్ల ఎమ్మెల్యే అసంతృప్తి...



కోరుట్ల నియోజకవర్గంలో విద్యాశాఖ అధికారుల పని తీరుపై ఎమ్మెల్యే డాక్టర్ కల్లకుంట్ల సంజయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మెట్‌పల్లిలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కారణంగా ఇప్పటి వరకు పదో తరగతి విద్యార్థులకు కేవలం 20 శాతం సిలబస్ పూర్తి చేయడం బాధాకరమన్నారు. మరికొన్ని రోజుల్లో జరగనున్న పరీక్షలకు విద్యార్థులు ఎలా హాజరవు తారని, ఫలితాలు ఎలా ఉంటాయని అధికారులను నిలదీశారు. విద్యాశాఖ పని తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అధికారులతో కొంత వాగ్వాదానికి దిగారు. విద్యార్థులకు సరైన బోధన అందించడంలో విఫలమైన అధికారులు బాధ్యతల నుంచి తప్పు కోవాలని సూచించారు. నియోజకవర్గంలో గోదావరిపై నిర్మిస్తున్న సదర్‌మట్ ప్రాజెక్టు, గంగనాల ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతులకు సక్రమంగా సాగు నీరు అందడం లేదని తెలిపారు. ఎస్ఆర్ఎస్పీ, వరద కాలువ నుంచి నీటిని రాజకీయ కారణాల వల్ల దిగువ ప్రాంతాలకు తరలించుకపోతున్నారని, ఇటువంటి వ్యవహారాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సమావేశంలో అధికారులను కోరారు.

ప్రోటోకాల్‌పై సమావేశంలో రగడ...

జిల్లాలో ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌లతో పాటు పలువురు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు ఆరోపించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం లేకుం డానే అనధికార వ్యక్తులు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నారని, వాటిని అధికారులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రోటోకాల్ పాటించని అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకొని ఇప్పటికే జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులకు ప్రోటోకాల్ అమలు చేయాలని ఆదేశించామని వివరించారు.

సమస్యలపై గళమెత్తిన సభ్యులు...

జిల్లాలోని ఆయా మండలాల్లో నెలకొన్న సమస్యలను పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రస్తావించారు. సకాలంలో అధికారులు సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కథలాపూర్ మండలంలో గల రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువ మరమ్మతు పనులు జరిపించాలని, మెట్‌పల్లి మండలం జగ్గసాగర్ వరద కాలువ రెగ్యూలెటరీ గేట్లు మరమ్మతు చేయించాలని సభ్యులు డిమాండ్ చేశారు.

మహిళా సంఘాలకు అవసరం లేకున్నా పలు సందర్భాల్లో టార్గెట్ల కోసం బలవంతంగా రుణాలు అంటగట్టడం వల్ల సభ్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొడిమ్యాల మండలంలో యాసంగి సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులకు సాగు నీరు అందకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని సభ్యులు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకవచ్చారు.

కలక్టర్, కోరుట్ల ఎమ్మెల్యేలకు ఘన సన్మానం...

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గం నుంచి గెలుపొంది తొలిసారిగా జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను పాలకవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారంటూ కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. దీంతో పాటు జిల్లాకు కొత్తగా వచ్చిన జడ్పీ సీఈవో గౌతంరెడ్డి, డిప్యూటీ సీఈవో రఘువరన్‌లను సైతం సత్కరించారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.



హాజరైన జడ్పీటీసీలు, అధికారులు

సమస్యలకు అధికారులు పరిష్కారం చూపాలి: కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలకు అధికారులు పరిష్కారం చూపే దిశగా పనిచేయాలని కలెక్టర్ షేక్‌యాస్మిన్ బాషా ఆదేశించారు. ప్రస్తుత సమావేశంలో వెలుగులోకి వచ్చిన సమస్యలను నోట్ చేసుకొని పరిష్కారానికి తీసుకున్న ప్రయత్నాలను తెలియజేయాలన్నారు.

పలు సమస్యలు పదే పదే పలు సమావేశాల్లో సభ్యులు ప్రస్తావిస్తున్నారన్నారు. సమస్యలను సైతం జడ్పీ అధికారులు మినిట్స్‌లో నమోదు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. ప్రోటోకాల్ పాటించని అధికారులపై ఆధారాలతో సహా సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి కొత్తగా రెండు పథకాలను ప్రారంభించారన్నారు.

రూ. 500కే గ్యాస్ సిలెండర్, ఉచిత విద్యుత్ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైన పాఠశాలలకు ఉపాధ్యాయులను అడ్జెస్ట్ చేయడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మార్చి మొదటి వారంలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని కోరారు.

ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌కు పదోన్నతి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారి

జగిత్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఎస్పీ సన్ ప్రీత్ సింగ్‌కు మంగళవారం పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెలక్షన్ గ్రేట్ లెవల్ 13 ఇన్‌ద పే ఆఫ్ మ్యాట్రిక్ ఆఫ్ ఐపీఎస్‌గా సన్ ప్రీత్ సింగ్‌కు పదోన్నతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. ఈ సందర్భంగా పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీని జగిత్యాల, మెట్‌పల్లి డీఎస్పీలతో పాటు పలువురు పోలీసు అధికారులు కలిసి అభినందించారు.

'పల్స్ పోలియో' విజయవంతం చేయాలి

రాయికల్, ఫిబ్రవరి 27: అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు మార్చి 3వ తేదీ ఆదివారం రోజున నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి సతీష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమంపై మండల అధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ 0-5 ఏళ్ల మధ్య గల పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని, రెండవ, మూడవ రోజు ఇంటింటికీ వాక్సినేటర్స్ తిరిగి ఎవరైనా పోలియో చుక్కలు వేయించుకో ని పిల్లలకు వేయించాలని అన్నారు. హైరిస్క్ ఏరియాల్లో మొబైల్ టీమ్ ద్వారా మండలంలోని అందరు పిల్లలకు పోలియో చుక్కలు వేయిస్తామని పేర్కొన్నారు.

జగిత్యాల(గొల్లపల్లి): మండలంలోని వచ్చే నెల 3నుంచి జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి సీహెచ్ నరేష్ కోరారు. మంగళవారం మండల రెవిన్యూ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమంపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఆయన చెప్పారు. తహసీల్దార్ మహ్మద్ జమీర్, ఎంపీడీ వో రాంరెడ్డి, ఎంపీవో సురేష్‌రెడ్డి, ఎంఈవో జమునదేవి, సీహెచ్‌వో జి.శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించండి'

రాయికల్, ఫిబ్రవరి 27: రాయికల్ పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు ఎలిగేటి అనిల్ కుమార్ మంగళవారం మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లుకు వినతి పత్రం సమర్పించారు. పట్టణంలో కొన్ని రోజులుగా పారిశుధ్య వాహనాలు తిరుగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కోతులు, కుక్కల బాధ అధికంగా ఉన్నందున వీలైనంత త్వరగా చర్యలు చేపట్టాలని కోరారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 27 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని, నిజామాబాద్ ఎంపీ బీజేపీ అభ్యర్థిగా మరోమారు అర్వింద్ పోటీ చేసి విజయం సాధిస్తారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రవీణ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభం జనంతో నిజామాబాద్ ఎంపీగా అర్వింద్ గెలుపొందడంతో పాటు కేంద్రంలో మంత్రి పదవిని సైతం దక్కించుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అర్వింద్ గతంలో చెరుకు రైతుల కోసం పాదయాత్ర చేశారని, రైతు సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ ముందుంటుందన్నారు. బీజేపీ చేపట్టిన సంకల్ప యాత్ర ముగియక ముందే ఓటమిపై భయంతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనవసర విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదానీ, అంబానీలు బీజేపీ పాలనలో ఎదిగినట్లు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, తప్పుడు ప్రచారాలను ప్రజలు విశ్వసిం చరన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకలు రంగు గోపాల్, కృష్ణహరి, తిరుపతి, రాజు, దశరథ్, పద్మ, వంశీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో రాణించిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

రాయికల్, ఫిబ్రవరి 27: రాయికల్ పట్టణంలో భీమన్న జాతరను పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో నృత్య విభాగంలో రాయికల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమంగా నిలిచారు. నృత్యం విభాగంలో పెండేలా రోషిణి, శ్రీలత, స్నేహ, ఆశ్రిత, పల్లవి, మధురిమ, మాధవిలు ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు శ్రీపతి రాఘవులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పొన్నం రమేష్, రవీందర్, మల్లేశం, గంగజమున, సత్యనారాయణ, జ్యోతి, వనజ, నాగరాజు, శ్రావణ్ కుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

జగిత్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నేడు నిర్వహించే జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారు. బీసీ మహిళ సమాజిక వర్గానికి చైర్‌పర్సన్ పదవి రిజర్వ్ చేసి ఉంది. చైర్‌పర్సన్ పదవిని దక్కించుకోవడానికి బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ పలువురు కౌన్సిలర్లు పదవి కోసం పోటీ పడుతుండడంతో బల్దియా రాజకీయం రసకందాయంగా మారింది. పదవులను ఆశిస్తున్న నేతలు కొన్ని రోజులుగా క్యాంపు రాజకీయం నిర్వహిస్తున్నారు. సుమారు 19 మంది కౌన్సిలర్లతో బీఆర్ఎస్‌కు చెందిన ఓ వర్గం గోవాలో క్యాంపు నిర్వహిస్తుంది. ప్రస్తుతం గోవా నుంచి తిరు ప్రయాణంలో పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లున్నారు. మరికొంత మంది కౌన్సిలర్ల మద్దతుతో మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు రాజకీయ మంత్రాంగం చేస్తున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన 39 వార్డు కౌన్సిలర్ సమిండ్ల వాణి, 36వ వార్డు కౌన్సిలర్ అడువాల జ్యోతి, 7వ వార్డు నుంచి స్వతంత్రంగా గెలుపొంది ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న వల్లెపు రేణుకలు చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం. అధిష్టానం మద్దతు సమిండ్ల వాణికే ఉన్నట్లు బల్దియా రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

● బల్దియా బలాబలాలు ఇలా...

జగిత్యాలలో 48 వార్డులున్నాయి. ఇందులో బీఆర్ఎస్ 30, కాంగ్రెస్ 7, బీజేపీ 3, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 1, ఏఐఎంఐఎం 1, ఇండిపెండెంట్ 6 స్థానాల్లో విజయం సాధించారు. అనంతరం 7వ వార్డు కౌన్సిలర్ రేణుక బీఆర్ఎస్‌లో చేరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలో 37 వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన బోగ శ్రావణి పీఠాన్ని కైవసం చేసుకున్నారు. 2023 జనవరి 25న చైర్ పర్సన్, కౌన్సిలర్ పదవులకు శ్రావణి రాజీనామా చేశారు. దీంతో బీఆర్ఎస్ 29 స్థానాలకు పరిమితమైంది. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు హక్కును ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ గతంలో వినియోగించుకున్నారు. శ్రావణి రాజీనామా తరువాత నుంచి వైస్ చైర్మన్‌గా ఉన్న గోళి శ్రీనివాస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇటీవల పలువురు కౌన్సిలర్లు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినా ఎమ్మెల్సీ కవిత జరిపిన మంత్రాంగంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. తాజాగా చైర్ పర్సన్ పదవి భర్తీ కోసం కలెక్టర్ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నెల 28న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న చైర్ పర్సన్ పదవి ఎన్నికకు హాజరు కావాలని కౌన్సిల్ సభ్యులకు అ ధికారులు ఇప్పటికే నోటీసులు అందజేశారు.

● విప్‌పై బీఆర్ఎస్ దృష్టి...

చైర్‌పర్సన్ ఎన్నికల్లో అధిష్టానం ఆశీస్సులు అందుకున్న ఓ వర్గం విప్ రాజకీయంపై దృష్టి సారించింది. బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ ఇప్పటికే జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో విప్‌ను అమలు చేయడానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌కు అవకాశం కల్పిస్తూ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారు. లేఖను బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్ నేతృత్వంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల అధికారిని కలిసి అందజేశారు. 39వ వార్డు కౌన్సిలర్ సమిండ్ల వాణి వైపు అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం ఉంది. ఇప్పటికే సుమారు 19 మంది కౌన్సిలర్లతో వాణి ప్రత్యేక క్యాంపును నిర్వహిస్తున్నారు. మరో పది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్ల వ్యవహారం స్పష్టంగా లేదు. బీఆర్ ఎస్‌కు చెందిన మరో ఇరువురు కౌన్సిలర్లు అడువాల జ్యోతి, వల్లెపు రేణుకలు సైతం చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తూ పావులు కదుపుతుండడంతో ఎవరు..ఎవరికి మద్దతు ఇస్తారో తెలియని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో విప్ జారీ చేసి కౌన్సిలర్లు చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవడంపై అధిష్టానం దృష్టి సారించింది. దీంతో కౌన్సిలర్లు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.



అధికారికి విప్ నియామక పత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● మ్యాజిక్ ఫిగర్ 24...

మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని దక్కించుకోవడానికి 24 సంఖ్య మ్యాజిక్ ఫిగర్‌గా మారింది. మున్సిపల్‌లో 48 వార్డులుండగా ఒక వార్డు కౌన్సిలర్ స్థానం ఖాళీగా ఉంది. 47 వార్డులకు కౌన్సిలర్లు ప్రాతినిత్యం వహిస్తున్నారు. ఇద్దరు అభ్యర్థులు పోటీపడితే చైర్‌పర్సన్ పదవికి 24 మంది మద్దతు కూడగట్టుకోవాల్సి ఉంటుంది. మ్యాజిక్ ఫిగర్‌ను దక్కించుకోవడానికి బీ ఆర్ఎస్‌లోని రెండు వర్గాలు పోటీ పడుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, ఏఎంఐఎం, స్వతంత్రులు, ఇతరుల మద్దతు ఎవరి వైపోనని చర్చ చోటుచేసుకుంది.

దేశ కీర్తి ప్రతిష్ఠలు ప్రపంచానికి చాటిచెప్పింది మోదీ

- ఆరుగ్యారెంటీలతో ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్
- బీజేపీ జాతీయ కార్యదర్శి డీకే అరుణ

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 27 : భారతదేశం కీర్తి ప్రతిష్టలు ప్రపంచం నలుమూ లల విస్తరించేలా సుపరిపాలన అందిస్తున్నది ప్రధానమంత్రి నరేంద్రమోదీనే నని బీజేపీ జాతీయ కార్యదర్శి డీకే అరుణ అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని విజయ సంకల్ప యాత్రలో పాల్గొనేందుకు వెళుతుండగా మంగళవారం మెట్‌పల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకుంటున్న సాహసోపేతమైన నిర్ణయాలతో ప్రపంచంలోనే 5వ బలమైన ఆర్థిక దేశంగా భారత్ ఎదిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ వారసత్వ రాజ కీయాలను అంతం చేసే దిశగా మోదీ నిర్ణయాలు ఉండబోతున్నాయన్నారు. ఏళ్ల నుంచి పరిష్కారం కాని సమస్యలు ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్, 500 ఏళ్ల రామమందిర నిర్మాణాలు వంటి ప్రధాని మోదీ చేసి చూపారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తున్నట్లుగా బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటే అని దుష్ప్రచారం చేస్తున్నరని, కానీ బీఆర్ఎస్ కాంగ్రెస్‌లు లోపాయికారి ఒప్పందంతో పని చేస్తుందని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే హామీలు నెరవేరుతాయని నమ్మబలుకుతూ గ్యారంటీలతో అబద్దాలు ఆడుతున్నారన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, అచరణకు సాధ్యం కాని హామీలతో గెలుపొంది ప్రజలను మోసం చేస్తూ పబ్బం గుడుపుతోందని దుయ్యబట్టారు. కాళేశ్వరం విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ విచారణ అంటూ మాట్లాడి ఇప్పుడు అధికారంలోకి రాగానే ఎందుకు మాట్లాడటం లేదన్నారు. మహిళలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు మారంపెల్లి సత్యనారాయణరావు, పట్టణాధ్యక్షుడు బోడ్ల రమేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గం సభ్యు డు ధోనికెల నీవన్, గంగారెడ్డి, సంకేట విజయ్ పాల్గొన్నారు.



మెట్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీకే అరుణ

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 27: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారు చేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఈ సందర్భంగా ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



బద్ది పోచమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

రైల్వే ప్లాట్ ఫాంపై వ్యక్తి మృతి

జమ్మికుంట,ఫిబ్రవరి27: జమ్మికుంట రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫాంపై ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృత్యువాత పడ్డాడు.రామగుండం రైల్వేహెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన ఔట్‌పేషెంట్ చీటి ఉందని అందులో అతడి పేరు సాగర్ తండ్రి జితేందర్ అని ఉన్నట్లు తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. బ్లూ కలర్ ఫుల్ షర్ట్ దానిపై పసుపు రంగు నిలువు గీతల డిజైన్ బ్లాక్ లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రజల బాగోగులు తెలుసుకునేందుకే బీజేపీ యాత్ర

తిమ్మాపూర్, ఫిబ్రవరి27: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రజల బాగోగులు తెలుసుకోవడం కోసమే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర చేపట్టారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మూగ జయశ్రీ అన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో మార్చి 2 నుంచి జరగబోయే యాత్రకు సంబంధించి తిమ్మాపూర్ మండల కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎంపి బండి సంజయ్ చేస్తున్న ప్రజాహిత యాత్రపై రాళ్ల దాడి చేసిన కాంగ్రెస్ నాయకుల చిల్లర బుద్ధులను ప్రజలు గమనిస్తున్నారని జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బండి సంజయ్ మాటలను వక్రీకరించి లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్‌ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్‌ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాసామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.

తల్లిని అడ్డుపెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్‌ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్‌ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

నకిలీ డాక్యుమెంట్ల కేసులో మరొకరి అరెస్టు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 27: నకిలీ డాక్యుమెంట్లతో భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కేసులో చిట్యాల కిష్టమ్మ(75)ను మంగళవారం అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో జైలుకు తరలించినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ఈ నెల 20న కొత్తపల్లికి చెందిన కనుకారెడ్డి ఫిర్యాదుతో నందెల్లి మహిపాల్‌తో పాటు 9 మందిపై నమోదైన కేసులో ఏ1 కిష్టమ్మను అరెస్టు చేశామని తెలిపారు.

హెచ్‌ఐవీ బాధితులకు చేయూత అందించాలి

● రాష్ట్ర ఏయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైమావతి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 27: హెచ్‌ఐవీ బాధితులకు చేయూత అందించాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హైమావతి అన్నారు. కుటుంబ సభ్యులు, పిల్లలకు ఇండెక్స్ పరీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జాతీయ ఏయిడ్స్ నియంత్రణ సంస్థ విభాగాల డాక్టర్లతో పాటు కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలకు చెందిన ఐసీటీ, పీపీటీసీటీ, డీఎస్‌ఆర్‌సీ, ఏఆర్‌టీ కేంద్రాల కౌన్సిలర్లు, డాక్టర్లు, ఎన్‌జీవో ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. రిస్క్ గ్రూపు వారిని గుర్తించి, ఏఆర్‌టీ మందులను సక్రమంగా అందించాలని సూచించారు. ఎన్‌ఏసీసీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీ సాక్స్ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, జాయింట్ డైరెక్టర్లు కరుణశ్రీ, మేఖల, అసిస్టెంట్ డైరెక్టర్ ఇందిరా, సేతు మాదవ్, కన్సల్టెంట్ డాక్టర్లు డాక్టర్ పార్థసారధి, డాక్టర్ లేహార్‌వాణి, డీటీసీవో డాక్టర్ రవిందర్‌రెడ్డి, డీఏపీసీయూ మేనేజర్ సురేందర్‌రెడ్డి, పీఆర్ శ్రీనివాస్, సురేందర్, సుమన్, రమేశ్, శ్రీనివాస్, ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో ఒకరి రిమాండ్

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 27: భూమి కొనుగోలు విషయంలో తప్పించుకొని తిరగడంతో పాటు కులం పేరుతో దూషించిన సంఘటనలో గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన నర విద్యాసాగర్ రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఈ ఘటనపై మంగళవారం డీఎస్పీ భీమ్‌శర్మ విచారణ చేపట్టారు. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన భూక్య నరేష్ నాగంపేటకు చెందిన విద్యసాగర్‌రెడ్డి దగ్గర రూ.47 లక్షలకు భూమి కొనుగోలు చేసి 15 లక్షలు చెల్లించారు. నరేష్ మిగతా డబ్బులు చెల్లించేందుకు విద్యాసాగర్ రెడ్డికి ఫోన్ చేసినా స్పందించకుండా తప్పించుకొని తిరగడంతో సోమవారం కనిపించాడు. నరేష్ మిగతా డబ్బులు చెల్లిస్తా నా భూమి ఎక్కడ ఉందో చూపించమంటూ అడగడంతో కులం పేరుతో విద్యాసాగర్‌రెడ్డి ఆయనను దూషించారు. కులం పేరుతో దూషించడంతో నరేష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు. నరేష్ ఫిర్యాదుతో కులం పేరుతో దూషించిన విద్యాసాగర్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో సింగరేణి కార్మికుడు మృతి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 27: గోదావరిఖని పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని డ్రైన్‌లో మంగళవారం రాత్రి పూరెళ్లి సాగర్(35) అనే వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక మిలీనియం క్వార్టర్స్‌లో నివాసముండే సాగర్ జీడీకే 1ఇంక్లైన్‌లో పనిచేస్తున్నాడు. అనారోగ్య కారణాలతో సింగరేణి ఆసుపత్రిలో చేరిన ఆయన శుక్రవారం నుంచి కనబడడం లేదని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. కొంత కాలంగా కుటుంబ వివాదాలతో భార్య కాపురానికి రావడం లేదు. మృతదేహంపై పలు చోట్ల గాయాలున్నాయి. వన్‌టౌన్ పోలీసులు సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు.

రెండు రోజుల క్రితం సాగర్ నడుచుకుంటూ వచ్చినట్లు ఫుటేజీ లభించింది. కాగా సాగర్ తల్లి అమ్మాయి తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, అతని మృతిలో భార్య, అత్తంటి వారి ప్రమేయం ఉన్నట్లు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ ఎస్ఐ సమ్మయ్య ఘటన స్థలంలో పరిశీలన జరిపారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లలో వేగం పెంచాలి

● సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడ, ఫిబ్రవరి 27: మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మార్చి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర మహోత్సవాల ఏర్పాట్లను ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 3 షిఫ్టుల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని, తాత్కాలిక పార్కింగ్ లాట్స్‌ను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని అన్నారు. శివ భక్తుల కోసం సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. నిర్దేశించుకున్న ప్రకారం జాతర ప్రారంభ సమయానికి పనులు పూర్తి చేయాలని, ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. గత అనుభవాల దృష్ట్యా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ ప్రాంగణం, జాతర పరిసరాలను నిరంతరం శుభ్రం చేయించాలన్నారు. మానిటరింగ్‌కు సెక్టార్ల వారీగా సంబంధిత అధికారులను నియమించాలని, మున్సిపల్, టెంపుల్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు పర్యవేక్షించాలని ఆదేశించారు. జాతర సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. అవసరం మేరకు టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, దేవస్థానం క్యూలైన్లు, పరిసర ప్రాంతాల్లో రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా భక్తులకు తాగునీటి వసతి కల్పించాలని, ప్రతీ 100 మీటర్లకు తాగునీటి ట్యాపులను ఏర్పాటు చేయాలని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, జాతర ప్రాంగణ మొత్తం సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పార్కింగ్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారి అన్సారీ, మున్సిపల్ కమీషనర్ అన్వేష్, ఆలయ ఈఈ రాజేష్, ఏఈవో జయ కుమారి, టౌన్ సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

● జాతర ఏర్పాట్లపై నేడు సమీక్ష

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై బుధవారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

భూమి నకిలీ పత్రాలు సృష్టించిన ఇద్దరిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 27: తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌పరిధిలో భూమి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాలు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. తంగళ్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్ శివారులో 45 సంవత్సరాల క్రితం గుర్రం అంజయ్య కొనుగోలు చేసిన భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఈ భూమిని తంగళ్లపల్లికి చెందిన కోడి అంతయ్య ఆక్రమించాలనే ఉద్దేశంతో గుర్రం అంజయ్యను అతడి కుటుంబ సభ్యులను బెదిరించి భూమి కబ్జా చేశాడు. తంగళ్లపల్లి శివారులోని శోభ భూమిలోకి సైతం అక్రమంగా ప్రవేశించినందుకు అతడిపై మరో కేసు నమోదు చేశామని ఎస్పీ వెల్లడించారు. అదే విధంగా తంగళ్లపల్లి మండలంలోని అంకుసాపూర్ సర్వే నంబర్ 160లో రెండు గంటల భూమి తన పేరును లేకపోయినా ఉన్నదని నమ్మించి చిలుక శ్రీనివాస్ అనే వ్యక్తితో ఒప్పందం చేసుకొని అతని వద్ద నుంచి రూ .8.40 లక్షలు తీసుకున్న వట్టిమల్ల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామన్నారు. భూ కబ్జాలకు సంబంధించి ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ అన్నారు. జిల్లాలో భూ కబ్జాలు చేస్తూ, భూమి నకిలీ పత్రాలు సృష్టించి బెదిరింపులకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలన్నారు.

దేవుడి పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ



మాట్లాడుతున్న గజ్జెల కాంతం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 27: బీజేపీ దేవుడి పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ మత రాజకీయాలు చేస్తూ ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్నదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కుల సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం విమర్శించారు. డీసీసీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు సహించరానివన్నారు. బండి సంజయ్ మతి స్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఈ సారి బండి సంజయ్‌కి పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాదన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందన్నారు. బండి సంజయ్ ఎంపీగా గెలిచిన తరువాత ఇప్పటి వరకు కేంద్రం నుంచి ప్రత్యేకంగా ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని విమర్శించారు. రాముడు దేశ ప్రజలందరి ఆరాధ్య దేవుడన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కాగ్ రిపోర్ట్‌లో గత రాష్ట్ర ప్రభుత్వంలో రూ.3 లక్షల కోట్లు అవినీతిపై సీబీఐ, ఈడీ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌తో లోపాయికారి ఒప్పందంతోనే లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కవితను అరెస్టు చేయటం లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవితల అవినీతిపై విచారణ జరపాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), ఫిబ్రవరి 27 : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామానికి చెందిన నిమ్మల రాజు (44) బెహరన్ దేశంలో మృతి చెందగా మంగళవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. నిమ్మల రాజు గత పదేళ్లుగా బెహరన్ వెళ్తున్నాడు. అక్కడ ఓ కంపనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాజు గుండెపోటుతో మృతి చెందాడు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ

చొప్పదండి, ఫిబ్రవరి 27: చొప్పదండి జెడ్‌పి బాలుర పాఠశాలకు చెందిన 13 మంది బాలికలకు ఉమెన్స్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ మంగళవారం సైకిళ్లను పంపిణీ చేసింది. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జమున, ప్రవీణ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, పీడి కృష్ణ పాల్గొన్నారు.

మానసాదేవి ప్రతిష్ఠాపన మహోత్సవం

కోరుట్ల, ఫిబ్రవరి 27: పట్టణంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం మానసాదేవి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు రామకృష్ణ శర్మ మంత్రోశ్చరణ మధ్య ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా దేవాలయ ఆవరణలో ఉన్న పాము పుట్ట వద్ద నాగేంద్ర సహిత మానసాదేవి ప్రతిష్ఠాపన జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యహవాచనం కార్యక్రమాలను నిర్వహించి ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించారు.



ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు, వేదపండితులు

కొండగట్టులో భక్తుల సందడి



అంజన్న ఆలయం వద్ద భక్తులు

మల్యాల, ఫిబ్రవరి 27: కొండగట్టు అంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అంజన్న దర్శనం అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. సమ్మక్క సారక్క భక్తుల రద్దీ దృష్ట్యా నిలిపి వేసిన వాహనపూజలు, అభిషేకాలు పునరుద్ధరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కమలాకర్ (ఫైల్)

బోయినపల్లి, ఫిబ్రవరి 27: బోయినపల్లి మండలంలో ద్విచక్రవాహనాన్ని లారీ అతివేగంగా ఢీకొనడంతో గంగాధర మండలం పిట్టలపల్లికి చెందిన గోదాల కమలాకర్ (45) మంగళవారం అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. గంగాధర మండలం పిట్టలపల్లి గ్రామానికి చెందిన కమలాకర్ కోర్టు కేసు నిమిత్తం వేములవాడకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. బోయినపల్లి మార్కెట్ యార్డు సమీపాన ఇటుక బట్టీల యజమానులు డంప్ చేసిన మట్టి నిల్వలను తరలించేందుకు లారీ వస్తోంది. లారీ డ్రైవర్ వాహనాన్ని అతి వేగంగా కమలాకర్ ద్విచక్ర వాహనాన్ని వెనక వైపు నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కమలాకర్ లారీ కింద పడి అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్‌ను అరెస్ట్ చేయాలని రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకోని మృతుని కుటుంబసభ్యులను ఆందోళనను విరమింప జేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తి సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చుసుకోని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అధికారులు సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



పైడిమడుగు గ్రామంలో వార్డులను సదర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 27 : సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని పైడిమడుగు గ్రామంలో నమస్త వార్డు సందర్శనలో భాగంలో గ్రామంలోని వార్డులను సందర్శించారు. అక్కడ నెలకొన్న సమస్యల గురించి కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో కేటాయించిన అభివృద్ధి పనులను వేగవంతగా పూర్తి చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. గ్రామాల అభివృద్ధి దిశగా నడిపంచేందుకు గ్రామస్థాయి ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సింగిల్ విండో ఛైర్మెన్ జగన్‌మోహన్ రావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

వరి సాగు పరిశీలించిన అధికారులు

మల్యాల, ఫిబ్రవరి 27: మండలంలోని ముత్యంపేటలో మంగళవారం వరి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి వాణీ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో వివిధ సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. యాసంగిలో మొక్కల సాంద్రతపై పలు సూచనలు చేశారు. రైతులు వరి చిరు పొట్ట దశలో యూరియా, పొటాష్ కలిపి చల్లాలని అన్నారు. కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు నివరాణకు తీసుకోవాల్సిన చర్యలు రైతులకు తెలిపారు. అలాగే రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలని అయిల్‌ఫాం సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని సూచించారు. మండల వ్యవసాయ అధికారి చంద్ర దీపక్, ఏఈవో కారుణ్యకుమార్ రైతులు శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, చొక్కారెడ్డి, కమలాకర్‌రెడ్డి ఈ కార్యక్రమంలో ఉన్నారు

లక్ష్యం మేరకు మొక్కలు సిద్ధం చేయాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి

పెగడపల్లి, ఫిబ్రవరి 27 : తెలంగాణ హరితహారంలో భాగంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలలో ఆయా గ్రామాల లక్ష్యం మేరకు మొక్కలను పెంచాలని పెగడపల్లి ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నందగిరి, అయిత్‌పల్లి గ్రామాలలో నర్సరీలను, ఉపాధిహామీ పనులను ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలలో మొక్కల పెంపకం తీరును పరిశీలించి ఆయా గ్రామాల లక్ష్యం మేరకు అవసరమైన మొక్కలనే పెంచాలని, ఉపాధిహామీ పనులలో హాజరు శాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపాధిహామీ క్షేత్ర స్థాయి సిబ్బంది ఉన్నారు.

నేడు రూరల్ ఎంపీపీ ఎన్నిక



ఎన్నికల అధికారికి బీఆర్ఎస్ విప్ పత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 27 : జగిత్యాల రూరల్ మండల పరిషత్ ఎంపీపీ ఎన్నిక బుధవారం ఉదయం 11 గంటలకు మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. బీఆర్ఎస్‌పార్టీ ఎంపీటీసీలకు విప్ పత్రం జారీ చేశారు. బీఆర్ఎస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ జారీ చేసిన విప్ లెటర్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తరఫున బీఆర్ఎస్ ప్యాక్స్ ఛైర్మన్ మహిపాల్‌రెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు బాలముకుందం, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దావ సురేష్ మంగళవారం ఎన్నికల అధికారి మదన్‌మోహన్‌కు అందజేశారు. బీఆర్ఎస్‌కు మెజార్టీ ఎంపీటీసీలు ఉండడంతో బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యుడు ఎంపీపీగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. బీఆర్ఎస్‌లో ఇద్దరు ఎంపీటీసీ సభ్యుల మధ్యలో తీవ్రపోటీ నెలకొంది. దీంతో రూరల్ ఎంపీపీకి ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు విశ్వప్రయత్నాలు చేశారు. ఓ ఎంపీటీసీ సభ్యుడు తాను చెప్పిన వ్యక్తికి ఎంపీపీ పదవి ఇవ్వకపోవడంతో నిరుత్సాహంగా క్యాంపు నుంచి వెళ్లిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు నర్సింగాపూర్ ఎంపీటీసీ మహేష్‌కు మద్దతు తెలపడంతో ఆయన ఆధ్వర్యంలో క్యాంపునకు వెళ్లినట్లు తెలిసింది. దీంతో రూరల్ ఎంపీపీగా నర్సింగాపూర్ ఎంపీటీసీ మహేష్ ఎన్నికయ్యేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. నాటకీయపరిణామాల వద్ద నేడు రూరల్‌ఎంపీపీ ఎన్నిక జరుగనుంది.

రేణుకా ఎల్లమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి

బీర్‌పూర్, ఫిబ్రవరి 27: రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు మన అందరిపై ఉండాలని కాంగ్రెస్ యువ నాయకులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తనయుడు రాంచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలంలోని తాళ్లధర్మారం గ్రామంలో రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ వృత్తి అన్ని వృత్తుల కన్నా ప్రమాదకర మైనదని వారి ధైర్యాన్ని అభినందించాలని అన్నారు. ఎంపీపీ మసర్తి రమేష్, వైస్ ఎంపీపీ లక్ష్మన్ రావ్, తా టిపర్తి బాల కృష్ణారెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ నవీన్ రావ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుభాష్ యాదవ్, కాంగ్రెస్ ప్రచారకమిటీ కన్వీనర్ జితేందర్ యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

జగిత్యాల, ఫిబ్రవరి 27(గొల్లపల్లి): కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో గొల్లపల్లి మండలం మల్లన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనబర్చి పలు పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మల్లన్నపేట ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న మలపు సంజన, భీమానాథం భవ్యశ్రీ, పడాల అనుశ్రీ బంగారు పథకాలు పాధించారు. షేర్ల మధుశైని పడాల ప్రణీతలు వెండి పతకం సాధించగా పడాల అక్షయ, దాసరి కార్తీక, చేకూట రియాలు కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం, అసిస్టెంట్ గ్రాండ్ మాస్టర్ హరికృష్ణ, మాస్టర్‌లు వెంకటేశ్వర్లు, చిరంజీవి, ఉపాధ్యాయులు అబినందించారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 27: నేతన్నల ఆకలి కేక మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ పిలుపు నిచ్చారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కూచన శంకర్, కుడిక్యాల కనకయ్య, అక్కల శ్రీనివాస్, సామాల నర్సయ్య పాల్గొన్నారు.

పేరుకే పంచాయతీలు

రెవెన్యూ విభజన లేక అవస్థలు

ఏళ్లు గడిచినా పూర్తికాని వనరుల పంపకం



రామారావుపల్లె గ్రామపంచాయతీ కార్యాలయం

రాయికల్, ఫిబ్రవరి 27: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నూతన జిల్లాలతో పాటు మండలాలు, నూతన గ్రామ పంచాయతీలు ఏర్పడినా గతం లో పంచాయతీలుగా ఏర్పడి నేటికి రెవెన్యూ విభజన జరగక పోవడంతో ఇటు రైతులు, అటు గ్రామపంచాయతీలకు ఆదాయం కొరవడింది. పేరుకే పంచాయతీలుగా ఉండి గతంలోని రెవెన్యూ గ్రామాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. గ్రామాలకు సీనరేజి నిధులు రాకపోవడంతో పాటు ప్రత్యేకంగా రెవెన్యూ సేవలు అందడం లేదు. గ్రామాల మధ్య చెరువులు, వాగుల పం పకంలో గొడవలు తలెత్తుతున్నాయి. గ్రామపంచాయతీలుగా మారి ఏళ్లు గడిచినా రెవెన్యూ విభజన జరగక పోవడంతో గ్రామాల్లో పూర్థిస్థాయి పాలన జరగడం లేదు.

రాయికల్ మండలంలో 32 గ్రామపంచాయతీలు ఉండగా రెవెన్యూ గ్రామాలు 20మాత్రమే ఉండటంతో గతంలో పంచాయతీలుగా ఏర్పడిన జగన్నాథ్‌పూర్, రామారావుపల్లె, చెర్లకొండాపూర్, కొత్తపేట, రాజనగర్, సింగరావుపేట, అయోధ్య గ్రామాలు ఏర్పడి 30ఏళ్లు గడిచినా నేటికీ రెవెన్యూ విభజన జరగక పోవడంతో ఆయా గ్రామస్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

రెవెన్యూతో పాటు గ్రామంలో వనరుల పంపకం నిలిచిపోవడంతో పేరుకే పంచాయతీలుగా మారి ఇతర పనులకు గతంలోని గ్రామాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. అల్లీపూర్ రెవెన్యూ పరిధిలో అయో ధ్య, సింగరావుపేట గ్రామాలు, మూటపల్లి రెవెన్యూ పరిధిలో కొత్తపేట, బోర్నపల్లి పరిధిలో జగన్నాథ్‌పూర్, ఇటిక్యాల పరిధిలో రామారావుపల్లె, ఆలూరు పరిధిలో రాజనగరం, రాయికల్ పరిధిలో చెర్లకొండాపూర్ గ్రామాలు ఉండటంతో ఆయా గ్రామాల్లో రెవెన్యూ పరంగా భూముల క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్లు జరిగితే వచ్చే ఆదాయం రెవెన్యూ గ్రామాలకు వెళ్లడంతో పంచాయతీలకు ఆదాయం రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతన మండలాలు ఏర్పడటంతో పాటు తండాలు పంచాయతీలుగా మార్చిన ప్రభుత్వం పంచాయతీలను రెవెన్యూ విభజన చేసి గ్రామాలకు రెవెన్యూ పాలన సౌలభ్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ విభజన చేపట్టాలి

ఎడమల జీవన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అయోధ్య



గ్రామం ఏర్పడిన నాటి నుంచి రెవెన్యూ పరంగా విభజన జరగక పోవడంతో గ్రామానికి ఆదాయం రావడం లేదు. స్థానికంగా సమస్యలు పరిష్కరించ డం ఇబ్బందిగా మారింది. పదేళ్లుగా విభజన చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెవెన్యూ విభజన చేయాలి.

గ్రామాలు అభివృద్ధి చెందుతాయి

ఆత్రం విజయ, మాజీ సర్పంచ్ జగన్నాథ్‌పూర్



పంచాయతీగా మారినా ఇప్పటికీ రెవెన్యూ గ్రామంగా మారకపోవడంతో మాగ్రామానికి సీనరేజి నిధులు రావడం లేదు. నూతన జిల్లాలో రెవెన్యూ ప రంగా విభజన జరిగితే పాలనా పరంగా సౌలభ్యం తోపాటు వచ్చే ఆదాయంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. రైతులకు రెవెన్యూ సేవలు త్వరగా అందుతాయి.

క్రీడలతో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపు

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 27 : విద్యార్థులకు మేధాశక్తి పెరగడానికి క్రీడలు ఎంతో ఉపయోగ పడుతుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ మినీ స్టేడియంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రీడలను ప్రారంభించి క్రీడకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేను నాయకులు, నిర్వహకులు శాలువాలతో సన్మానించి నోటుబుక్కులు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలను స్ఫూర్తిగా తీసుకొని విజయాలు సాంధించాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలంటే మేధాశక్తి కావాలని, దీనికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయాన్నరు. క్రీడల్లో గెలుపు ఓటమిలను సమానంగా తీసుకోని ప్రతి ఆటల్లో లోపాలను గమనిస్తూ మంచి విజయాలను సాధించలన్నారు. విద్యార్థులు పట్టుదలతో విద్యాను అభ్యసించి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని, చెడు అలవాట్లుకు లోనై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, నిర్వహకులు, క్రీడకారులు పాల్గొన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల ఫిర్యాదు

కథలాపూర్, ఫిబ్రవరి 27 : కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర రవాణాశాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ మాతృమూర్తిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మతం పేరుతో ఓట్లు దండుకుంటున్న బండి సంజయ్‌కుమార్ నియోజకవర్గంలో చేసిందని శూన్యమని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటు కోసం పార్లమెంట్‌లో కొట్లాడిన పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే అర్హత సంజయ్‌కుమార్‌కు లేదని అన్నారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అల్లూరి దేవన్న, లింగంగౌడ్, కాశవత్రి వంశీ, కల్లెడ గంగాధర్, ఉరుమల్ల చారి, కూన అశోక్, మోహన్, సత్యనారాయణ, అనంతరెడ్డి, వెగ్యారపు శ్రీహరి, సంతోష్, న్యావనంది శేఖర్, పంజాల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ నిర్మాణం చేపట్టాలి

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 27 : ఆధ్యాత్మికత ఉట్టిపేడేలా ఆలయ నిర్మాణం చేపట్టాలని మక్క మాల పీఠాధితి పతి శ్రీధర్‌స్వామిజీ అన్నారు. మంగళవారం పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయాన్ని అయన సందర్శించి చేపట్టిన నిర్మాణ పనులను పరిశీలించారు. పీఠాధిపతికి ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు ఆధ్వర్యంలో నాయకులు స్వాగతం పలికి శాలువలతో సన్మానించి ఆశ్వీరదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలోని దేవుని ప్రతిమకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్మాణా పనులు పూర్తి చేయాలని, భావితరాలకు ఆధ్యాత్మిక సాంప్రదాలు తెలియజేసే విధంగా పనులు చేపట్టాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి, నాయకులు బండారి సదాశివకుమార్, చాడ సురేష్, ఎల్మీ రవి, దొంతుల లక్ష్మీనారాయణ, కొత్త నవీన్, కోట కిరణ్, పడిగెల శ్రీనివాస్, బండారి గోపి, దొంతుల సంతోష్, చిట్టిమేలి శ్రీనివాస్, ఎనుగందుల సంతోష్, చింతలవకుమార్, రాచేష్, చందు, నాగలక్ష్మి, శంకర్, పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, ఫిబ్రవరి 27 : మండల కేంద్రంలో నిర్మించిన శ్రీలక్ష్మీవేం కటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన నాంపెల్లి రాములులలిత దంపతులు 25 వేల 116 రూపాయలను ఆలయ పూజారి నాగ రాజు రమేష్‌కు అందించారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో హోమం

బీర్‌పూర్, ఫిబ్రవరి 27: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో మంగళవారం రాత్రి జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ ఆవరణలో ప్రత్యేక హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య హోమం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, కేడీసీసీ జిల్లా మెంబరు రాంచందర్ రావ్, ఆలయ ఛైర్మన్ ఎనగంటి సామ్రాట్, ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు సంతోష్, మధుకుమార్, సంతోష్, పాల్గొన్నారు. లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను అందించి ఆశీర్వచనాలను ఇచ్చారు. అనంతరం జాతర ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రూరల్ సీఐ ఆరీఫ్ ఆలీఖాన్, సారంగాపూర్ ఎస్సై తిరుపతి, బీర్‌పూర్ ఎస్సై గౌతమ్ పవర్, ఎంపీపీ రమేష్, ఆలయ ఛైర్మన్ సామ్రాట్, అర్చకులు, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై ఎంపీ అర్వింద్ ఆరోపణలు మానుకోవాలి

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, ఫిబ్రవరి 27 : నిజామాబాదు ఎంపీ అహంకారి దర్మపురి అర్వింద్ కాంగ్రెస్‌పై చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని మాట్లాడే టప్పుడు ఓళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణారావు మాట్లాడారు. 2019 సంవత్సరంలో తనను పార్లమెంట్ సభ్యుడుగా గెలిపిస్తే పసుపు బోర్డు తీసుకొస్తానని హామీ ఇచ్చి మూసి ఉంచిన చక్కర కర్మాగారాన్ని తన సొంత నిధులతో తెరిపిస్తామని ప్రకటించి ఇప్పటి వరకు దానిపై స్పదించకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వ లేక తప్పుడు ప్రచారం చేయడం బీజేపీ నాయకులు అలవాటుగా మారిందన్నారు. ఇప్పడికైన బీజేపీ నాయకులు వాస్తవాలు తెలుసుకోని మాట్లాడాలని అన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

రాయికల్, ఫిబ్రవరి 27: నూతనంగా బదిలీపై వచ్చిన రాయికల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌ను మంగళవారం గోసంగి సంఘం యువకులు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోసంగి సంఘం యువకులు కలమడుగు రమేష్, మొలుగు వెంకటేష్, సొరపాక శివ, కేతం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాత్యాయనీ దేవి వ్రతం

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 27 : పట్టణంలోని పెదమ్మ ఆలయంలో కాత్యాయనీ దేవి వ్రతాన్ని నిర్వాహకులు, భక్తులు, మహిళలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పెద్దమ్మ ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి, శ్యామలదేవి, కాత్యాయనీ దేవి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పంచా మృత అభిషేకాలు, పూజలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ మూర్తులతో భక్తులు ఆలయం చుట్టు ప్రదక్షనలు చేసి ఆయలంలో ఏర్పాటు చేయగా కాత్యాయనీ దేవి వత్రం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పుష్పార్చనలతో అభిషేకాలు, పూజలు తది తర కార్యక్రమాలతో పాటు కుంకుమ పూజలు ఆలయ పురోహితుడు మదన్‌శర్మ మంత్రోచారణల మధ్య మహిళలచే వైభవంగా జరిపించారు. అనంతరం శ్రీ ఐశ్వర్యలక్ష్మి గోశాల తరుపున గాజుల పూజ నిర్వహించి మహిళలకు పసుపు కొమ్ము, గాజులు, పండ్లను భక్తులకు పురోహితుడు ప్రసాదంగా అందజేశారు.

భక్తులు గోశాలోని ఆవులకు ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి దక్కేదెవరికో..?

- ఎమ్మెల్యే ఆశీస్సుల పైనే గంపెడాశలు
- పెరుగుతున్న ఆశావాహులు



మార్కెట్ కమిటీ కార్యాలయం

కథలాపూర్, ఫిబ్రవరి 27 : రాష్ట్రంలో మార్కెట్ కమిటీలను ప్రభుత్వం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన క్రమంలో నూతన కమిటీల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గత సర్కారు ఛైర్మన్ పదవులకు రిజర్వేషన్లు నిర్ణయించి కమిటీలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో పదవులపై కాంగ్రెస్ శ్రేణులు ఆశల పల్లకిలో ఉన్నారు.

గడిచిన పది సంవత్సరాలుగా పదవుల్లేక నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్లాడిన కాంగ్రెస్ నేతలు పదవుల కోసం ఉవ్విళ్లూరుతున్నారు. ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని భావిస్తున్న నేపథ్యంలో ఆశావాహుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.

● రిజర్వేషన్ తేలడంతో పెరిగిన ఆశావాహులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మార్కెట్ ఛైర్మన్ పదవులకు రిజర్వేషన్లు నిర్ణయించి రొటేషన్ పద్ధతితో ఛైర్మన్లను నియమించారు. మొదటిసారి ఎస్సీ, రెండవసారి జనరల్, మూడోసారి బీసీ మహిళకు కేటాయించారు. జనరల్‌కు కేటాయించిన సమయంలో పోటీ అధికమై ఎవరికి ఇవ్వాలనే విషయంలో ఏడాదిన్నకాలం సమయం వృధా అయింది. ఆ సందర్బంలో బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు సైతం చోటుచేసుకున్నాయి. అయితే ప్రస్తుతం ఈ ప్రభుత్వం ఛైర్మన్ పదవి జనరల్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో పోటీ తీవ్రమైంది. ఛైర్మన్ గిరి మండల స్థాయిలో ప్రోటోకాల్ పరిధిలోకి వస్తున్న క్రమంలో ఆ పదవి ఆశించే వారి సంఖ్య అధికంగానే కనిపిస్తోంది. ప్రస్తుత బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అల్లూరి దేవన్న, సత్యనారాయణ పేర్లు ఛైర్మన్ పదవి ఆశిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో మార్కెట్ అభివృద్ధి కోసం రు. 2 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినా ఆ పనులను అనుమతి రాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

● ఎమ్మెల్యే సీనన్న ఆశీస్సులు ఎవరికో..

మార్కెట్ కమిటీ ఛైర్మన్, డైరెక్టర్ల ఎంపిక విషయంలో స్థానిక ఎమ్మెల్యేదే తుది నిర్ణయం కావడం వల్ల ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆశీస్సులు ఎవరికి ఉండబోతున్నాయనేది చర్చనీయాంశంగా మారింది. పార్టీకి కష్టకాలంలో పనిచేసి, విధేయులుగా ఉండి ఎన్నికల్లో శక్తివంచన లేకుండా పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారనే ప్రచారం జరుగుతోంది.

లోకసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఏ క్షణంలోనైనా మార్కెట్ కమిటీ నియామకాలకు సంబంధించి ప్రకటన వెలువడుతుందని కాంగ్రెస్ శ్రేణులు ఆశాభావంలో ఉన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

జగిత్యాల, ఫిబ్రవరి27 (ఇబ్రహీంపట్నం): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. ఎంపీపీ, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డితో పాటు కోజన్‌కొత్తూర్ ఎంపీటీసీ మాత్రమే హాజరు కాగా మిగతా వారు గైర్హాజరు కావడంతో సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన రత్నాపూర్ మల్లన్న జాతర

మల్లాపూర్, ఫిబ్రవరి, 27 : మండలంలోని పునరావస గ్రామమైన రత్నాపూర్ శివారులో గల కొండపై జరుగుతున్న మల్లిఖార్జున జాతర వేడుకలు మంగళవారం ముగిశాయి. నాలుగు రోజులుగా వేడుకలు ఘనంగా జరిగాయి. పల్లకి సేవ, బోనాలు, రథోత్సవం, అగ్నిగుండం తదితర కార్యక్రమలు చేపట్టారు. భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మొగిలిపేట గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సుజిత్‌రావు పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మల్లాపూర్, ఫిబ్రవరి, 27: విద్యార్థులు ఇష్టపడి చది వితేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని నాయకులు, ఉపాధ్యాయులు అన్నారు. మంగళవారం మండలంలో ని మొగిలిపేట గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు బీజేపీ నాయకుడు గోల్కొండ ప్రవీణ్ తన బృందంతో కలిసి పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. పాఠశాలలో మంచి ప్రతిభ పొందిన విద్యార్థులకు అవార్డులను అందజేశారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

రాయికల్, ఫిబ్రవరి 27: మండలంలోని అల్లీపూర్ గ్రామం లో పంచాయతీ కార్యదర్శిగా నాలుగేళ్లు సేవలందించి బదిలీపై వెళ్తున్న ఎంఏ అక్బర్‌ను ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం సన్మానించారు.గ్రామస్థులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామాభివృద్ధికి కృషి చేసి ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డులను సాధించారని గుర్తు చేశారు.

విద్యార్థులకు షీ టీం పై అవగాహన

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 27: జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ జ్యోతిబాఫూలే విద్యాయంలో షీ టీం, ఏహెచ్‌టీయూ, ఆధ్వర్యంలో విద్యార్థిలనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వలీబేగ్, శంకరయ్య, ఉమెన్ కానిస్టేబుల్‌లు సౌజన్య, పూజిత, మంజుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

జిల్లాలో మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలి

మల్లాపూర్, ఫిబ్రవరి, 27: కేంద్రంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకన కేంద్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాంచర్ల రాజేష్ కోరారు. మంగళవారం ఓ ప్రకటన ద్వారా అధ్యాపకుల సమస్యలను తెలిపారు. జిల్లా పరిధిలో పలు కళాశాలల్లో వేలాది విద్యార్థులు ఇంటర్ అభ్యసిస్తుండగా అధ్యాపకులు ఇంటర్ పరీక్షల మూల్యాంకన కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వెళ్లడం వలన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కథలాపూర్, ఫిబ్రవరి 27 : మండలంలోని పోతారంలో మంగళవారం పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఇటీవల రూ. 5 లక్షలు మంజూరు కాగా పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పులి హరిప్రసాద్, నర్సయ్య ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బీర్‌పూర్, ఫిబ్రవరి 27: బీర్‌పూర్ జరిగే శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాలలో భక్తుల దాహార్తి తీర్చడం కోసం మంగళవారం ఎస్సై గౌతమ్ పవర్ చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీపీ రమేష్, కేడీసీసీ జిల్లా మెంబరు రాంచందర్‌రావ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కొడిమ్యాల, ఫిబ్రవరి 27: ఈ నెల 28 బుధవారం నుంచి నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ ఇందూర మంగళవారం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 132 మంది, ద్వితీయ సంవత్సరంలో 153 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో తాగునీటి సౌకర్యం, డ్యూయల్ డెస్కులు, వెంటిలేషన్, మరుగుదొడ్ల వసతులను కలిపించామన్నారు. విద్యార్థులు ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించమన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

కొడిమ్యాల, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని యూనియన్ బ్యాంక్ శాఖ మేనేజర్ సంజీవ్ ప్రారంభించారు. వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడానికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందని వక్తలు తెలిపారు. మండలంలోని పలు బ్యాంక్ మేనేజర్లు, మెట్‌పల్లి బ్రాంచ్ కౌన్సిలర్ రాజేష్, శంకర్, నరేష్, గోల్డ్ అప్రయిజర్ ముమ్మడి స్వామి పాల్గొన్నారు.